యోగాసనాలు వేస్తున్న ఎంపీ సంజీవ్‌కుమార్, డిఎస్‌పి మహబూబ్‌బాషా

జిజిహెచ్‌లో సౌకర్యాలను మెరుగు పరచాలి

- పరీక్షలు ఆసుపత్రిలోనే చేయాలి -కమీషన్ల దందాను అరికట్టాలి
- జిజిహెచ్ క్యాజువాలిటీ ముందు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడంతోపాటు అన్ని రకాల మందులు ఉచితంగా ఇవ్వాలని, అన్ని రకాల రోగ పరీక్షలు ఆసుపత్రిలో చేయాలని ఇక్కడ జరుగుతున్న కమిషన్ల దందాను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని గౌస్‌దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, నగర కార్యదర్శులు ఎం.రాజశేఖర్, టి.రాముడు హెచ్చరించారు. బుధవారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన జిజిహెచ్ కాజువాలిటీ ముందు ధర్నా చేశారు. ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి ధర్నా వద్దకు వచ్చి ప్రజలతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి సిఎస్ ఆర్‌ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు వచ్చి సిపిఎం నాయకులతో మాట్లాడినా ఆందోళన విరమించలేదు. సూపరిన్‌టెన్‌డెంట్ వస్తేనే సమస్యలు పరిష్కష్కారమవుతుయని నాయకులు భీష్మించడంతో కొంతసేపు ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం సిఎస్‌ఆర్‌ఎంఒకు వినతిపత్రం ఇచ్చారు. తన పరిధిలో ఉన్న అంశాలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మిగతా అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయి మాట్లాడుతూ ఈ ఆసుపత్రికి రాయలసీమతో పాటు తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిమంది రోగులు వస్తుంటారని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటిస్తే ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు వస్తుంటారని తెలిపారు. ప్రభుత్వం జిల్లా ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు అందడం లేదని మండిపడ్డారు. నగరంలో ఇద్దరు వైద్యులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనా ఆసుపత్రి సేవలను మెరుగుపరచడంలో విఫలం చెందారని అన్నారు. మిగిలిన ప్రజా ప్రతినిధులు ఎవరి దందాను వారు కొనసాగిస్తున్నారని వివరించారు. ఆస్పత్రి సిబ్బందిని ఇష్టారాజ్యంగా తొలగిస్తూ అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడుతూ సిబ్బందిపై పెత్తనం చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. జిజిహెచ్ కు నిత్యం ప్రతిరోజు సుమారు 2500 మంది పేషెంట్లు వస్తుంటారని కనీసం 300 మంది ఆసుపత్రిలో అడ్మిట్ అవుతుంటారని తెలిపారు. ఓపీకి వచ్చిన రోగులకు అడ్మిట్ అయిన రోగులకు వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయని అన్నారు. రోగులకు సెలైన్ బాటిల్ ఎక్కించాలన్నా, ప్రమాదంలో గాయాలపాలు అయితే వేసే బ్యాండేజ్, చేతికి వేసుకునే గ్లౌజులు, ఆక్సిజన్ కిట్లుతో సహా చివరకు షుగర్ టెస్ట్ చేయాలంటే కూడా గ్లూకోమీటర్ బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఫ్లోరింగ్ వేసినా టైల్స్ పగిలి రోగులు డాక్టర్లు వైద్య సిబ్బంది వచ్చిన ప్రజలు నడవలేని పరిస్థితి ఉందన్నారు. స్త్రీలకు పురుషులకు ఒకే టాయిలెట్స్ ఉంటే ఎలా వెళతారని ఆయన ప్రశ్నించారు. స్ట్రెక్చర్ కావాలన్నా సెల్‌ఫోన్ తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఇదేటని అడిగితే వార్డులో వార్డు బాయ్ లేరని మీరు కొత్త కాబట్టి స్ట్రెక్చర్ తీసుకెళ్లి ఎక్కడ పెట్టి పోతారో అనే భయంతో గ్యారంటీ కోసం సెల్ కావాలని సిబ్బంది చెప్పడం దారుణం ఉన్నారు. ఏడు వార్డులకు కలిపి ఒక వార్డ్ బాయ్ ఉంటే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. చెడిపోయిన ఎక్స్‌రే మిషన్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని, లేదా కొత్తవి కొనాలన్నారు. వార్డుల్లో ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టాలని, వార్డ్ బాయ్స్ సంఖ్యను పెంచాలని, స్ట్రెక్చర్లను కొనుగోలు చేయాలని, క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డ్స్, వార్డ్ బాయ్స్, స్కావెంజర్స్‌కు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు విజయ్, అబ్దుల్లా, షరీఫ్, రామకృష్ణ, సుధాకరప్ప, నరసింహులు, మహమ్మద్, సాయిబాబా, ఐద్వా నాయకురాలు పద్మ, సుజాత, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటరాముడు, డివైఎఫ్‌ఐ నాయకులు నగేష్, రాఘవేంద్ర, హుస్సేన్ శిరీష, స్థానికులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో జిజిహెచ్ క్యాజువాలిటీ ముందు ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి

ఆరోగ్య సూత్రాలు నేర్పేది యోగా : ఎంపీ

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

ప్రపంచ దేశాలకు ఆరోగ్య సంజీవినిగా యోగ విద్యను అందించిన ఘనత భారతదేశానికే దక్కుతుందని, మన దేశంలో పుట్టిన మనమంతా ఆరోగ్యంగా ఉండాలని కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ అన్నారు. బుధవారం కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో జిల్లా ఆయుష్ శాఖ, కర్నూలు నగరపాలక సంస్థ, జిల్లా యోగా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని కర్నూల్ నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ, జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ,జాతీయ యోగ సంఘం సభ్యులు శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి తో పాటు ఆయుష్ శాఖ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎపిఎస్‌పిడిఎస్‌పి మహబూబ్ బాషాతో కలిసి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ఎంపి ప్రారంభించారు. జిల్లా నుంచి జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు అడ్వాన్స్ యోగాసనాల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగా శిక్షకులు ఆసనాలు వేయించి శిక్షణ ఇచ్చారు. రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆనందరావు, రిజిస్టర్ సుందరానంద పుచ్చ, రామకృష్ణ ఫౌండేషన్ నిర్వాహకులు కె.రామాంజనేయులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉర్దూ యూనివర్సిటీలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు, సిబ్బంది, విద్యార్థులు యోగా ఆసనాలు చేశారు. కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో యోగాదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా విద్యార్థినిలకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కూడా ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రవీంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు 200 మంది అధ్యాపకులచే యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పాండురంగయ్య, ప్రిన్సిపల్ శ్రీనివాసమూర్తి తోపాటు వైస్ ప్రిన్సిపల్స్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్ట్ టైం, గెస్ట్ ఉద్యోగులకు

భద్రత కల్పించాలి: సిఐటియు

కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న పార్ట్ టైం ఉద్యోగులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కెజిబివిలో పని చేస్తున్న పార్ట్ టైం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జె. నాగేశ్వరరావు, ఓల్డ్ సిటీ సెక్రటరీ ఎం. విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట కెజిబివి పార్ట్ టైం, గెస్ట్ ఉద్యోగులు చేసిన నిరసన కార్యక్రమంలో జె. నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. పార్ట్ టైం ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. పార్ట్ టైం పేరుతో ఫుల్ టైం పనిచేస్తున్న ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలన్నారు. ఈ ఇంటర్వ్యూల వల్ల పార్ట్ టైం ఉద్యోగులకు గ్యారెంటీ ఉద్యోగ భద్రత ఉండదని, అభద్రతా భావనతో ఉన్నారన్నారు. వారి డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యోగులందరూ ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. తక్షణమే పార్ట్ టైం ఉద్యోగులకు గెస్ట్‌టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కరించకపోతే రానున్న కాలంలో నియామకమైన కాంట్రాక్టు ఉద్యోగులు టీచర్లు పార్ట్ టైం ఉద్యోగులు 17 రకాల ఉద్యోగులు ఐక్యమై పోరాడి హక్కులు సాధించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీలమ్మ, సోఫియా ,రంజిత ,శ్రీలలిత, లలితాదేవి, షకీలా, లీలమ్మ, శివలక్ష్మి, హేమలత తదితరులు నాయకత్వం వహించారు.

బాల్యవివాహాలు వద్దు..

విద్యాబుద్ధులే ముద్దు...

- కలెక్టర్ డాక్టర్ సృజన
- గోనెగండ్లలో ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - గోనెగండ్ల

బాలికలకు చిన్న వయస్సులో వివాహాలు చేయకుండా పెళ్లి వయస్సు వచ్చే వరకు విద్యాబుద్ధులు నేర్పించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం గోనెగండ్లలో భారత్ గ్యాస్ గోడౌను వద్ద ఉపాధి హామీ చట్టం కింద డిపి 86 డిస్ట్రిబ్యూటరీ కాలువ పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేస్తున్న కూలీలతో ఆమె మాట్లాడారు. ఉదయం ఎన్ని గంటలకు హాజరవుతున్నారు, తిరిగి ఇంటికి ఎన్ని గంటలకు వెళ్తున్నారు, పనులు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు, ప్రమాదాలు సంభవించినప్పుడు వైద్య సదుపాయం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మహిళా కూలీలతో మాట్లాడుతూ... పిల్లలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేయరాదని, బడికి పంపాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. పెళ్లీడు వరకు వారికి విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. కొంతమంది రైతులు వ్యవసాయ పొలాల్లో నీటిని నిలుపుకొని పంటలకు పెట్టుకునేందుకు వీలుగా రాతి ట్యాంకులను నిర్మించుకునేందుకు ఉపాధి హామీ చట్టం కింద అవకాశం కల్పించాలని కోరారు. దీని ద్వారా రైతులు రాత్రిపూట పొలాలకు వెళ్లకుండా, అవసరం లేని సమయాల్లో నీటిని నిల్వ చేసుకొని అవసరమైనప్పుడు పంటలకు నీరు ఇచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఆమె కూలీలకు మజ్జిగను పంపిణీ చేశారు. పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఏపీడీ అల్లీపీరా, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ నాగేష్, ఎపిఒ మహబూబ్ బాషా, ఈసీ ఉస్మాన్, ఫీల్డ్ అసిస్టెంట్ పేట సెలాం పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ : బనవాసి ఫారంలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యాసంస్థ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో గొర్రెలు, మేకల పరిశోధన కేంద్రాన్ని కలెక్టర్ సృజన, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. సెంట్రల్ నర్సరీలో మొక్కల పెంపకాలను, గణీకృత వీర్య ఆంబోతు కేంద్రంలో పశు గణన అభివృద్ధి ఎలా చేస్తారు, సేకరించిన ఆవులు, ఆంబోతుల నుంచి తీసిన శ్యాంపిల్స్‌ను స్టోర్ చేసే విధానాన్ని పరిశీలించారు. దాని గురించి అడిగి తెలుసుకుని ల్యాబ్‌ను పరిశీలించారు. ల్యాబ్‌లో పనిచేసే ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్వామా పీడీ అమర్‌ణాథ్ రెడ్డి, తహశీల్దార్ కె.ఆంజనేయులు, ఎంపిడిఒ బంగారమ్మ, గ్రామీణ ఎస్ఐ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

గోనెగండ్లలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎమ్మిగనూరులో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

పోరాటాలకు సిద్ధం కండి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాబోయే కాలంలో నిర్వహించే పోరాటాలకు కార్మికులు, ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి.అంజిబాబు కోరారు. బుధవారం జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో జరిగిన సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే కాలం పోరాటాల కాలమని, పోరాటాలకు కార్మికులు, ఉద్యోగులు సిద్ధంగా ఉండాలనికోరారు. అంగన్వాడీ సమస్యల పైన రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి కోర్కెల దినమైన జూలై 10 , 11 తేదీలలో 36 గంటల ధర్నా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు , ఔట్సోర్సింగ్ఉద్యోగుల సమస్యల పైన రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. ఈనెల 25న ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో కాంట్రాక్టు , ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి హామీని అమలు చేయకుండా కొంతమంది మాత్రమే రెగ్యులర్ చేస్తానని ప్రకటించడం సరైనది కాదన్నారు. రాష్ట్రంలో ఉండే మూడు లక్షల మంది కాంట్రాక్టు కార్మికులను, ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పైన ఈ నెల 26న కలెక్టర్ కార్యాలయం దగ్గర ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న రైతు పోరాటాలకు కార్మిక వర్గం అండగా నిలవాలని కోరారు. రైతు పోరాటాలకు సంఘీభావంగా జూలై ఒకటిన సంఘీభావ నిధి కార్మికుల దగ్గర నుండి వసూలు చేసి పంపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు బి.రామాంజనేయులు, జె నాగేశ్వరరావు.ఎం.గోపాల్, పి.ఈరన్న సిహెచ్.సాయి బాబా, ప్రభాకర్ ,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గస్తీని పటిష్ట పరచాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : జిల్లాలో పోలీసు గస్తీని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో 92 మంది సిసిటిఎన్‌ఎస్ పోలీసులతో ఈబీట్స్ పై శిక్షణకు సంబంధించిన వర్క్ షాప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ.... జిల్లాలో ఈ – బీట్స్ (గస్తీ) పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా రాత్రి, పగటి గస్తీలు నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఒక రోజు శిక్షణలో సిసిటిఎన్‌ఎస్ కంప్యూటర్ పోలీసులు నేర్చుకున్న విషయాలను తమ పోలీసుస్టేషన్ లలో గస్తీకి వెళ్ళే పోలీసు అధికారులు, సిబ్బంది మొబైల్ ఫోన్‌లలో వాళ్ళ సిఎఫ్‌ఎంఎస్ ఐడితో ఈ – బీట్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేయించాలన్నారు. జూన్ 24 లోపు ఈ–బీట్ సిస్టమ్ జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లలో అమలులో ఉండాలన్నారు. ఆయా సబ్ డివిజన్ల పరిధిలో బీట్ పాయింట్స్, రౌడీషీటర్స్, చెడు ప్రవర్తన గల వారి ఇళ్ళను, ప్రదేశాలను గుర్తించి ఈ – బీట్స్ బాగా చేయాలన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్ నుండి ఈ–బీట్ సిస్టమ్‌ను మానిటరింగ్ చేస్తుంటారన్నారు.సిఐలు అబ్దుల్ గౌస్, గుణశేఖర్ బాబు, రామయ్య నాయుడు, మనోహర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఈనెల 19న రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆరోగ్యం విషమించి కోలుకోలేక మృతి చెందాడని కర్నూలు ట్రాఫిక్ డిఎస్‌పి ఎం నాగభూషణం తెలిపారు. జంపాల శివయ్య నగర్ కు చెందిన కొండూరు రమేష్(44) బెంగళూరు నుండి హైదరాబాదు హైవేలో బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ బ్రిడ్జి పై స్కూటీ నడుపుకుంటూ చెన్నమ్మ సర్కిల్ నుండి సంతోష్ నగర్ వైపు వెళుతున్నాడు. బాలాజీ నగర్ కు చెందిన అక్కల దేవి అజయ్ బాబుమద్యం తాగి అతని వెనకాల అతివేగంగా కారు నడుపుతూ స్కూటీని ఢీకొట్లాడు. స్కూటీపై వెళ్తున్న కొండూరు రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. నిందితులపై 304 (2) కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కర్నూల్ ఎక్సైజ్ మ్యాజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ ఆదేశించారు. కర్నూల్ ట్రాఫిక్ పోలీసులు నిందితున్ని పంచలింగాల సబ్ జైల్‌కు రిమాండ్ కు అప్పగించామన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎస్ఎ కోఆర్‌డి నేటర్ వేణుగోపాల్ , వేదికపై జెసి మౌర్య

కెజిబివి అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన

జాయింట్ కలెక్టర్, ఎస్ఎస్ఎ పిసి పర్యవేక్షణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కెజిబివి ఉపాధ్యాయ నియామకాలకు మెరిట్ లిస్టును రోస్టర్ ఆధారంగా ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున 634 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. బుధవారం సమగ్ర శిక్ష అభియాన్ సమావేశ భవనంలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య సమగ్ర శిక్ష అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె. వేణుగోపాల్ పర్యవేక్షించారు. రెండు రోజులపాటు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టాలని జెసి ఆదేశించారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాలను పక్కాగా పరిశీలన చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. 23వ తేదీ రిజర్వుడేట్‌గా ఉంచుకొని ఎవరైనా హాజరుకాకుండా మెరిట్ లిస్టులో వారి పేరు ఉంటే వారి సర్టిఫికెట్ల ధ్రువీకరణ చేసుకునే అవకాశం కల్పించామని కె.వేణుగోపాల్ తెలిపారు. సర్టిఫికెట్ల ధ్రువీకరణ కొరకు పది టీములు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు ఎవరైనా నకిలీ ధృవపత్రాలు సమర్పించినట్లయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.సునీత, సి బెలగల్ ఎంఇఒ ఆజాంబాష ,కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

అధిక ధరలకు అమ్మితే సహించేది లేదు : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్

ఎరువులు, మందులు, విత్తనాలు అధిక ధరలకు అమ్మితే సహించేది లేదని ఎఒ మల్లేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయా ఎరవుల, మందుల దుకాణాలను తనిఖీ చేసి స్టాకు, ధరల పట్టికను పరిశీలించారు. రైతులకు ప్రతి కొనుగోలుపై బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, నిర్ణిత ధరలకు మించి అమ్మితే చర్యలు తప్పవన్నారు.

వర్షం నీరు వారం రోజులు రోడ్డుపైనే

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

దాదాపు 100 ఏళ్ల చరిత్ర కలిగిన పెద్ద పోస్ట్ ఆఫీస్ రోడ్డు ఒకరోజు వర్షం వస్తే వారం రోజులు నీరు నిలిచిపోతుంది. అటు పోస్టల్ ఆఫీస్, ఇటు పోస్టల్ ఎటిఎం లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వర్షం నీరు నిలిచి ప్రజలకు అసౌకర్యంగా ఉన్నా... మున్సిపల్ కార్పొరేషన్, ఆర్‌అండ్‌బి పోస్టల్ శాఖా అధికారులు స్పందించకపోవడం క్షమించరాని విషయమని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, పి ఇక్బాల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి టి.మద్దిలేటి విమర్శించారు. బుధవారం ఈ సంఘాల ప్రతినిధిబృందం అంబేద్కర్ సర్కిల్ నుండి కాంగ్రెస్ ఆఫీసు వరకు పర్యటించారు. వారు మాట్లాడుతూ అటు కొండారెడ్డి బురుజు ఇటు పోస్టల్ శాఖ ప్రధాన కార్యాలయం కలిగి ఎంతో చరిత్ర కలిగిన ఈప్రాంతంలో ఆర్‌అండ్‌బి అధికారులు దిగుడుగా రోడ్డును నిర్మించారు. దీన్ని మరమ్మతులు చేయాలనే స్పృహ కూడా ఇంజనీర్లకు లేదన్నారు. మున్సిపల్ ఇంజనీర్లు 3నెలల క్రితం మురుగు కాలువ పనులు ప్రారంభించి వదిలేశారన్నారు. వర్షం నీటి కోసం అడుగు కాలువ నిర్మిస్తే సరిపోతుంది కానీ ఐదు అడుగులు విస్తీర్ణంలో తవ్వి వదిలేయడంతో ప్రజాధనం వృధా అయ్యిందన్నారు. వందల రూ.కోట్ల పెద్ద ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లుగా హిటాచి యంత్రాన్ని అక్కడ పెట్టి షో చేస్తున్నారు తప్ప పనులు పూర్తి చేయడం లేదన్నారు. వారం రోజుల్లో నిర్మించాల్సిన కాలువ 3నెలలైనా గుంతలు తవ్వి వదిలేయడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. ఇప్పటికైనా కమిషనర్, మేయర్ స్పందించి వేగంగా మురికి కాల్వ పనులు పూర్తి చేయాలన్నారు. ఆ ప్రాంతంలో వచ్చే వర్షం నీరు మురుగు నీటికి తగినట్లుగా కాలువలు నిర్మించి ప్రజాధనం వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర నాయకులు కె.శ్రీనివాసులు,టి.గోపాల్ రెడ్డి, ఎల్.అబ్దుల్ నయూం పాల్గొన్నారు.

రోడ్డుపై నిలువ ఉన్న నీటిని పరిశీలిస్తున పిపిఎస్ఎస్ నాయకులు

టిడిపి గెలిస్తే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని వివరిస్తున్న టిజి.భరత్

చంద్రబాబుతోనే అభివృద్ధి : టిజి.భతర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు గెలవకపోతే రాష్ట్రంలో అభివృద్ధి ఉండదని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి టిజి.భరత్ అన్నారు. నగరంలోని 11వ వార్డు ఖడక్ పుర, కనికంటి వీధిలో ఆయన భవిష్యత్తుకు భరోసా పేరుతో ఇంటింటికి తిరిగి ప్రజలను కలిశారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కర్నూలును అభివద్ధి చేస్తానని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. టిజి.భరత్ మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే రాష్ట్రంలో చంద్రబాబు రావాలని, కర్నూలులో తాను ఎమ్మెల్యేగా గెలవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక అవకాశం ఇస్తే తన పనితీరు ఏంటో చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మెహబూబ్ ఖాన్, బషీర్, నౌషాద్, ఈశ్వర్, సలీం, ఫర్జానా, సభ, అదీబ్, రసూల్, సద్దాం, ఆనంతయ్య, ఆరిఫ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను
సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలి
- డిప్యూటీ కలెక్టర్ రమణ కాంత్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

మాట్లాడుతున్న రమణ కాంత్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మండల స్థాయి అధికారులు సమన్వయంతో ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రమణ కాంత్ రెడ్డి, ఎంపిడిఒ సుబ్బరాజు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మి నారాయణ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం విధి విధానాలను వివరించారు. అనంతరం వర్షాకాలంలో వచ్చే డెంగీ, మలేరియా, అతిసార తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. హౌసింగ్ కార్యక్రమాలు, నాడు-నేడు తదితర అంశాలపై చర్చించారు. డిప్యూటీ తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

బిజెపి మతోన్మాద రాజకీయాలతో
ఆర్థిక వ్యవస్థ నాశనం : సిపిఎం

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

బిజెపి మతోన్మాత రాజకీయాలతో ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు మండిపడ్డారు. దేశాన్ని తాకట్టు పెట్టే విధంగా బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందని విమర్శించారు. బుధవారం మండలంలోని పాండవగల్ గ్రామంలో శ్రీపాతూరి ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలాల పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మండల కార్యదర్శి కె.లింగన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశులు మాట్లాడారు. దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలను ఐక్యం చేసి ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న పార్టీ సిపిఎం అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మైనార్టీలు, ముస్లింలపై దాడులు తీవ్రం చేస్తోందని తెలిపారు. ఈ మతతత్వ విధానాలను తిప్పికొట్టేందుకు సిపిఎం కార్యకర్తలు సన్నద్ధం కావాలని కోరారు. ఈ తరగతులకు సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ, సిపిఎం పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న, కోసిగి మండల కన్వీనర్ రాముడు, కౌతాళం మండల కన్వీనర్ ఎం.ఈరన్న, బి.వీరారెడ్డి పాల్గొన్నారు.

నాసిరకం పనులను సహించను
- పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ డిఇ ఈరన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

రోడ్డు పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ అధికారులు

పంచాయతీ రాజ్ రోడ్డు పనుల్లో నాసిరకం పనులు చేపడితే సహించబోనని పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ డిఇ ఈరన్న కాంటాక్టదారులకు హెచ్చరించారు. బుధవారం రూ.5 కోట్ల నిధులతో చేపట్టిన పెంచలపాడు నుంచి గుమ్మనూరు రోడ్డు పనులను పంచాయతీరాజ్ ఎఇ సోలారెడ్డి ఆధ్వర్యంలో క్వాలిటీ కంట్రోల్ డిఇ ఈరన్న, ఎఇ ముక్తార్ బాష పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడారు. రోడ్డు పనుల్లో నాణ్యత ఉండాలని, పది కాలాలపాటు రోడ్డు చెక్కుచెదరకూడదని చెప్పారు. వర్షాలు ప్రారంభమయ్యేలోపు రోడ్డు పనులు ముగించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ సూరి పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

హాలహర్వి : హాలహర్వి జడ్‌పి హైస్కూల్‌లో కెనరా బ్యాంకు వారి సహకారంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు బుధవారం 'ఆర్థిక అక్షరాస్యత'పై క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి అర్ధగేరి జడ్‌పిహెచ్ స్కూల్‌కు చెందిన రవితేజ, మల్లికార్జున రూ.5 వేలు అందుకున్నారు. రెండో బహుమతి గూళ్యం జడ్‌పి హైస్కూల్‌కు చెందిన పల్లవి, సుప్రజ రూ.4 వేలు గెలుచుకున్నారు. మూడో బహుమతి హాలహర్వి జడ్‌పి హైస్కూల్‌కు చెందిన శ్రీలక్ష్మి, గాయత్రి రూ.3 వేలు అందుకున్నారు. ఎపిజిబి హాలహర్వి బ్రాంచి మేనేజర్ జగదీశ్వర్ రెడ్డి అధ్యక్షతన బహుమతులు అందజేశారు. ఎంఇఒ వీరన్న, ఎంఇఒ-2 శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో అభివృద్ధి

- సర్వసభ్య సమావేశంలో ఎంపిపి జూటూరు హేమలత, మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ
- వాడీవేడిగా సమావేశం
- ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలతో అధికారులు ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపిపి జూటూరు హేమలత, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం వాడీవేడిగా సాగింది. ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ముఖ్యఅతిథిగా ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ హాజరయ్యారు. వివిధ శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులు వివరించారు. ప్రతి గ్రామంలోనూ తాగునీటి సమస్య ఉందని డేగలహాల్ సర్పంచి నీలకంఠ, దౌల్తాపురం సర్పంచి లక్ష్మీదేవమ్మ, బెల్డోన సర్పంచి సావిత్రి, సంగాల ఎంపిటిసి భీమ లింగ ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అధికారి రామ్‌నీలాను నిలదీశారు. ఆయన సమాధానమిస్తూ... మండలంలో ప్రధానంగా చింతకుంట జలాశయం, కాజీపురం జలాశయం, బెల్డోన జలాశయం నుంచి తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. చింతకుంట జలాశయం నుంచి మండలంలోని ఐదు గ్రామాలకు తాగునీటి సరఫరా అవుతోందన్నారు. ఈ ఏడాది చింతకుంట జలాశయంలో సరిపడ తాగునీరు లేక చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి జల జీవన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మండలానికి రూ.2.30 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. తమ గ్రామాలకు విద్యుత్ స్తంభాలు కావాలని పలువురు ప్రజా ప్రతినిధులు ట్రాన్స్‌కో ఎఇని నిలదీశారు. అనంతరం ఎంపిపి, మార్కెట్ యార్డు ఛైర్మన్ మాట్లాడారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా సచివాలయ వ్యవస్థ, గ్రామ వాలంటీర్లు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా వివరించడానికి, సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. అధికారులందరూ సహకారమందిస్తే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామని కోరారు. వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య, వైస్ ఎంపిపిలు నరసింహులు, పద్మావతి, సర్పంచులు గోవిందరాజులు, రోహిణి, మల్లమ్మ, ఎంపిటిసిలు సుమలత, సరోజమ్మ, సుంకన్న, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, పిఆర్ ఎఇ చోళ రెడ్డి, ఎపిఎం నాగార్జున, సూపర్‌వైజర్ ప్రసూన, ఎఇఒ రమాదేవి, ఎపిఒ మాధవ శంకర్, ఎంఇఒ చక్రధర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత

సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్ రెడ్డి

'జగనన్న సురక్ష'ను జయప్రదం చేద్దాం : వైసిపి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి కోరారు. బుధవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కోసిగి సచివాలయం-1 పరిధిలో ఉన్న సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌రెడ్డి, ఎంపిడిఒ రాజేంద్ర ప్రసాద్, తహశీల్దార్ రుద్రగౌడ్ మాట్లాడారు. ఈనెల 23 నుంచి జులై 23 వరకు 'జగనన్న సురక్ష' చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంఎల్ఒ హనుమంతు రెడ్డి, ఎంపిపి ఈరన్న, నాడిగేని నాగరాజు, మాణిక్యరాజు, సచివాలయ కన్వీనర్లు మంగమ్మ, బుల్లి నరసింహులు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించాలి
- ఎడిఇ రాఘవేంద్ర

ప్రజాశక్తి - పెద్దకడబూరు

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి నాణ్యమైన విద్యుత్ వాడుకోవాలని ఎడిఇ రాఘవేంద్ర రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని బసలదొడ్డి గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణంలో విద్యుత్ వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ రాఘవేంద్ర మాట్లాడారు. అనవసరంగా లైట్లు, ఫ్యాన్లు వేయవద్దని తెలిపారు. బసలదొడ్డి, నాగలపురం గ్రామాల్లో రైతులు సమస్యలను ఎడిఇ దృష్టికి తెచ్చారు. తాగునీటి బోర్లకు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని తెలిపారు. పైరయ్య స్వామి గుడి వరకు రహదారి వెంట విద్యుత్ లైన్ వేయాలని, లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఎడిఇ హామీ ఇచ్చారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎడిఇ రాఘవేంద్ర

శంకర్ కుటుంబానికి న్యాయం చేయాలి
- ఎంఆర్‌పిఎస్ నాయకులు
- మృతదేహంతో గంటపాటు నిరసన

ప్రజాశక్తి - ఆదోని

హత్యకు గురైన ఐసి.శంకర్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని వైఎస్‌జి సర్కిల్‌లో మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. మృతుడు శంకర్ ఇంటి నుంచి మృతదేహంతో భారీగా ర్యాలీగా వచ్చారు. గంటపాటు మృతదేహాన్ని ఉంచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. దళితుడైన ఐసి.శంకర్‌ను అగ్రవర్ణాలైన నలుగురు పథకం ప్రకారమే ఈనెల 19న మద్యం తాగించి నడి రోడ్డుపై విచక్షణరహితంగా దాడి చేసి హత్య చేశారని తెలిపారు. మద్యం షాపులో వారితోపాటు శంకర్ కూడా మద్యం తీసుకున్నాడని, అక్కడి నుంచి ఎమ్మిగనూరు రహదారికి తీసుకెళ్లి బైపాస్ రోడ్డులో కర్రతో బాది 'దళితుడివైన నువ్వు మాతో పాటు కలిసి మద్యం తాగుతావా' అంటూ కర్రతో బాది హత్య చేశారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకొని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగంతో పాటు 5 ఎకరాల సాగు భూమి ఇవ్వాలని కోరారు. దళితులపై దాడులను అరికట్టాలన్నారు. హత్య చేసిన జగన్నాథ్ రెడ్డి, జయరాం రెడ్డి, రామలింగడు, రామకృష్ణను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలన్నారు. గంట పాటు బైఠాయించడంతో వన్‌టౌన్ సిఐ విక్రమ్ సింహ చేరుకొని వారికి నచ్చజెప్పి న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో ఫోన్ ద్వారా మాట్లాడించారు. ఆందోళన విరమింపజేసి శ్మశాన వాటికకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. నాయకులు బండారు హనుమంతు, చిన్న సంజప్ప, సుధాకర్, నరసింహులు, గోవిందరాజులు, కాంతరాజు, చిక్కం జానెయ్య, జగన్ పాల్గొన్నారు.

ఎయిడెడ్ హైస్కూళ్లు మాయం
- సిఎం సమాధానం చెప్పాలి
- టిడిపి నాయకుల

ప్రజాశక్తి - ఆదోని

నాడు ఉన్న ఎయిడెడ్ హైస్కూళ్లు నేడు మాయమయ్యాయని, దీనికి ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, సీనియర్ నాయకులు మదిరే భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సాంబకల్ ఫక్రుద్దీన్, బసాపురం రామస్వామి, గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, సోమశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టిడిపి నాయకులు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 42 వార్డులకుగాను ప్రభుత్వ హైస్కూళ్లలో ఎల్లే మల్లేశప్ప కన్నడ హైస్కూల్ మూసివేత దిశగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పడం ఒకటి, చేసేది మరొకటని విమర్శించారు. ఆదోని మున్సిపాలిటీలో దాదాపు 2 లక్షల కుటుంబాలకు గాను 3 హైస్కూళ్లు మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. వైసిపి అధికారంలో వచ్చాక ఎయిడెడ్ స్కూళ్లలో 8 స్కూళ్లు బంద్ కావడంతో పట్టణంలో చదువుకునే పిల్లలకు సీట్లు దొరకక తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. పట్టణంలో ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు మసూదియా హైస్కూల్, ఉర్దూ అంబర్‌పేట్ బాలిబాలికల హైస్కూల్ మాత్రమే నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఒసి విద్యార్థులకు మున్సిపల్ హైస్కూల్, నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ ఉన్నాయని, ఎటు చూసినా 5 కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. పట్టణంలో వీర సేవ కన్నడ స్కూల్, ఆలగంగమ్మ స్కూల్, మిఠాయి చెన్న బసప్ప స్కూల్, పొట్టిశ్రీరాములు స్కూల్, రాయ మిల్స్ హైస్కూల్, టిజిఎల్ హైస్కూల్, జీవేశ్వర హైస్కూల్, వైఎన్‌కె హై స్కూల్ మూతపడ్డాయన్నారు. మాజీ సర్పంచి కారుమంచప్ప, నారాయణపురం షేక్షావలీ, వాల్మీకి రాముడు, శివయ్య స్వామి, సాధిక్ వలీ పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన టిడిపి నాయకులు

సిఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని తాలూకా సిఐగా నిరంజన్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ మహేశ్వర్ రెడ్డి తిరుపతికి బదిలీ అయ్యారు. నిరంజన్ రెడ్డి సత్యసాయి జిల్లా నుంచి బదిలీ అయి ఇక్కడికొచ్చారు. ఈయన నల్లమాడు, నంద్యాల, కదిరి రూరల్ సర్కిల్‌లో పనిచేశారు. ఎస్‌ఐగా యాడికి, ఎల్లనూరు పరిధిలో పని చేశారు. సిఐ మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి రాజీపడే ప్రసక్తేలేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన సిఐకి ఎస్‌ఐలు చిన్న పీరయ్య, గోపాల్ రెడ్డి, రమేష్ బాబు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం డీఎస్పీ శివ నారాయణస్వామిని సిఐ మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యకు ప్రత్యేక స్థానం : వైసిపి

ప్రజాశక్తి - కౌతాళం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో విద్య రంగానికి ప్రత్యేక స్థానం కల్పించినట్లు వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం రౌడూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. వైసిపి నాయకులు పాండురంగ రెడ్డి, సోమిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, నర్సారెడ్డి, పాల్గొన్నారు.

కుల సర్టిఫికెట్ మార్పు చేసిన వారిపై
క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-ఆలూరు

బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎస్సీ కుల సర్టిఫికెట్‌ను ఇచ్చిన అధికారులు, అందుకు కారణమైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీలకు వర్గీకరణ చేయాలని ఓ పక్క ప్రజాసంఘాలు, కులసంఘాలు పోరాటం చేస్తుంటే రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి కుల సర్టిఫికెట్ మార్పులు చేయడం సబబు కాదన్నారు. జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి ఎస్సీ సర్టిఫికెట్‌తో పాటు రేషన్ కార్డులో పేరు మార్పు చేసిన రెవెన్యూ అధికారులు, అందుకు సహకరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

'మున్సిపల్ ఉపాధ్యాయులకు డివైఇఒ పోస్టులు కేటాయించాలి'

ఆదోని : మున్సిపల్ ఉపాధ్యాయులకు డివైఇఒ పోస్టులు కేటాయించాలని ఎపి ఎంటిఎఫ్ పట్టణ శాఖ అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సీనియర్ నాయకులు దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయుల యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని, మున్సిపల్ పాఠశాలలకు తగిన సంఖ్యలో పాఠశాల సహాయకులు, ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని కోరారు. మున్సిపల్ పాఠశాలల పర్యవేక్షణకు అర్బన్ లోకల్ బాడీ కింద ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారి-2 మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నారాయణను సన్మానిస్తున్న అధికారులు

గుమ్మనూరు నారాయణకు సన్మానం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండల పరిషత్ ఉపాధి హామీ భవనంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణను తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎపిఒ మాధవ శంకర్ శాలువా, పూలమాలతో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎపిఒ మాధవ శంకర్ మాట్లాడారు. మండలంలోని గుమ్మనూరు గ్రామం నుంచి మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి లభించడం సంతోషకరమని తెలిపారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ ఉద్యోగ సంఘాలకు, ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉండాలని కోరారు. అనంతరం నారాయణ మాట్లాడారు. తాను ఎల్లప్పుడూ అధికారుల పక్షపాతినే అని తెలిపారు. మంత్రి జయరామ్ సహకారంతో అన్ని శాఖల అధికారులను కలుపుకొని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వైసిపి ఆలూరు తాలూకా బూత్ కమిటీ సభ్యులు ఏరూరు రాజన్న, దౌల్తాపురం షేకన్న, సతీష్, సూరి పాల్గొన్నారు.

దేవనకొండలో స్టేట్ బ్యాంకు ఏర్పాటు చేయండి : వైసిపి

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో స్టేట్ బ్యాంకు ఏర్పాటు చేయాలని కర్నూలు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు, వైసిపి యూత్ లీడర్ కాకర్ల శాంతి కుమార్ కోరారు. బుధవారం స్టేట్ బ్యాంకు రీజనల్ మేనేజర్ సూర్య ప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో రెండో పెద్ద మండలం దేవనకొండ అని, హంద్రీనీవా ద్వారా నీటి పారుదల ఉన్న ప్రాంతమని తెలిపారు. మండలంలో ఇంత వరకు ఒక్క నేషనల్ బ్యాంకు కూడా లేదన్నారు. 44 గ్రామాల ప్రజలు, రైతులు, వ్యాపారులకు ఎపిజిబి బ్యాంకులు తప్ప నేషనల్ బ్యాంకు లేవన్నారు. గతంలో ఫ్యాక్షన్ ద్వారా వెనుకబడిన ప్రాంతం నుంచి ఇప్పుడిప్పుడే అభివృద్ధి, అక్షరాస్యత ఉన్న మండలంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. అనేక ఏళ్లుగా ప్రజలు, ప్రజా సంఘాలు, మేధావులు బ్యాంకు కోసం పోరాడుతున్నారని చెప్పారు.

వ్యాధిరహిత శరీరం కోసం యోగా...

ప్రజాశక్తి - ఆదోని

వ్యాధులు లేని శరీరం, వణుకులేని శ్వాస వంటివి యోగా వల్ల కలిగే ప్రయోజనాలని ఆర్ట్స్ కళాశాల ఎన్‌సిసి అధికారులు అనిల్ కుమార్, పరిమళ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తూ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మానవ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకొని ఆరోగ్యం, ఏకాగ్రత, మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవాలని తెలిపారు. యోగా వల్ల శరీరంలో ఒత్తిడి, హార్మోన్ కార్టిసాల్ స్థాయి తగ్గుతుందని చెప్పారు. యోగా మానసిక స్థితిని మెరుగుపరుస్తుందన్నారు. సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాలను పెంచుతుందన్నారు. ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ ఈరమ్మ, సుధాకర్ బాబు, నాగరత్న పాల్గొన్నారు. పట్టణంలోని భాష్యం ఆదోని-2 బ్రాంచిలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా మాస్టర్ సురేష్ యోగా భంగిమలు ప్రదర్శించి ఆరోగ్యానికి మంచిదని వివరించారు. కేశవ మాస్టర్ కొన్ని యోగా టిప్స్ ఇచ్చారు. ఆదోని-2 బ్రాంచి ప్రిన్సిపల్ సదాశివ, వైస్ ప్రిన్సిపల్ అంజి, ప్రధానోపాధ్యాయులు వాణి పాల్గొన్నారు. **ఆస్పరి**లోని నారాయణ ప్రైమ్ స్కూల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి, ఉపాధ్యాయులు సతీష్ కుమార్, జ్యోత్స్న, గాయత్రి, లూధియా, మణి, ఈశ్వర్, శ్రీదేవి, బాలు, గంగమ్మ, నారాయణ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** పట్టణంలో సాయి కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ కరణం శివప్రసాద్ విద్యార్థులతో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మండిగిరి పరిధిలో అమృత్ సరోవర్ మైదానంలో ఉపాధి హామీ చట్టం ద్వారా, పని ప్రదేశంలోనే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఏపీడీ లోకేశ్వర్ మాట్లాడుతూ... యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఎఒ విజయ శేఖర్, ఇఒఆర్‌డి ఇన్‌ఛార్జీ కె.నాగరాజు, ఎపిఒ చంద్రశేఖర్, రజక సంఘం సెక్రటరీ ముక్కన్న పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని కుందనగుర్తి గ్రామంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్ ఆధ్వర్యంలో ఉపాధి పనులు చేసుకుంటున్న కూలీలకు ఎపిఒ మాధవ శంకర్ యోగాపై అవగాహన కల్పించారు. యోగా చేయడం వల్ల మనిషి కండరాలన్నీ బాగా పని చేస్తాయని తెలిపారు. ఏపీడీ ఫక్కీరప్ప పాల్గొన్నారు. **హోళగుంద** పాఠశాలలో విద్యార్థులతో యోగా చేయించారు. సిద్ధార్థ పాఠశాల నిర్వాహకులు హెచ్.చిదానంద మాట్లాడుతూ... యోగా చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు.

ఆదోనిలో యోగా చేస్తున్న సిబ్బంది, విద్యార్థులు

సాయి కళాశాలలో యోగా నేర్పిస్తున్న కరణం శివప్రసాద్

చిప్పగిరిలో యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎపిఒ మాధవ

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని 26వ వార్డు సచివాలయంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. వార్డు పరిధిలోని కొన్ని వీధుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, సిసి రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం అన్ని వార్డుల్లో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రణాళిక ప్రకారం సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలను చేపడుతున్నామని చెప్పారు. వార్డు కౌన్సిలర్ నీలకంఠ, కేశవరెడ్డి, వైసిపి అధికార ప్రతినిధి సునీల్ కుమార్, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి

ట్యాంకు నిర్మాణంతో ప్రజల దాహార్తిని తీరుస్తాం
- ఒహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మేకడోనా, చిన్నతుంబలం, హెచ్.మురవణి గ్రామాల్లో జలజీవన్ విషయం కింద ఒహెచ్‌ఆర్ ట్యాంకులను నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని, ట్యాంకు నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజల దాహార్తిని ఇచ్చేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. బుధవారం జలజీవన్ మిషన్ కింద ట్యాంకు నిర్మాణానికి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సాయికుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. మేకడోన సర్పంచి నారాయణ స్వామి గౌడ్, వైసిపి నాయకులు కృష్ణ గౌడ్, యోగేంద్ర గౌడ్‌తో కలిసి ట్యాంకు నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలానికి కొలతలు చేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వద్దు...
- ఎంపిడిఒ రాధా

ప్రజాశక్తి - హోళగుంద

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, వేగవంతం చేయాలని ఎంపిడిఒ రాధా, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆదినారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీరో ప్రాసెసర్ ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు అందజేశామన్నారు. హౌసింగ్ నిర్మాణంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ గత సమావేశంలో హెచ్చరించినట్లు గుర్తు చేశారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు అడ్వాన్స్ కింద ఒక్కో లబ్ధిదారునికీ రూ.20 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాధా

సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

ఉన్నత విద్యా విధానం అమలులో
ప్రభుత్వం విఫలం : మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఉన్నత విద్యా విధానం అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షి నాయుడు విమర్శించారు. బుధవారం టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు ఆధ్వర్యంలో 'ఫీజు ఎక్కడ కంస మామా' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందని పరిస్థితి నెలకొందన్నారు. రామాంజినేయులు, బోయ తేజ మాట్లాడుతూ... పాఠశాలలు, కళాశాలలు ప్రారంభిస్తున్నా విద్యా వ్యవస్థలో మార్పులు లేవన్నారు. అమ్మఒడి పథకం ద్వారా 15 వేలు ఇస్తా అని చెప్పి దానిలో కోతలు విధించారని విమర్శించారు. నియోజకవర్గ అధ్యక్షులు బెస్త జయ సూర్య, ప్రధాన కార్యదర్శి బల్లేకల్ సూర్య, రమేష్ మాట్లాడుతూ... నిబంధనల పేరిట రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎలాంటి విద్యా పథకాలు అందని పరిస్థితి ఉందన్నారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ కార్యదర్శులు నూర్ బాష, సాయి, మహేష్, మహబూబ్, కరీం, ధర్మ, హేమంత్, దిలావర్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు వైసిపి అండ : వైస్ ఎంపిపి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

కౌలురైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వైస్ ఎంపిపి ఇర్ఫాన్ దేశాయి తెలిపారు. బుధవారం మండలంలోని కల్లుకుంట రైతు భరోసా కేంద్రంలో విఆర్ఒ తిప్పన్న, విఎఎ పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు ఇచ్చిన గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతులకు గుర్తింపు కార్డులు వరం లాంటివని చెప్పారు. **హాలహర్వి** మండలంలోని చింతకుంట గ్రామంలో కౌలు రైతుల గుర్తింపు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో దాదాపు 32 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇస్తామని ఎఒ శివ శంకర్ తెలిపారు. విఆర్ఒ విజయ్, సర్పంచి సద్దాం హుస్సేన్ పాల్గొన్నారు.

ఎస్ఐని సస్పెన్షన్ చేయాలి : మాల మహానాడు

ప్రజాశక్తి-ఆలూరు

నంద్యాలలోని దళిత యువకుడు చిన బాబు మృతికి కారణమైన నంద్యాల ఎస్ఐని సస్పెన్షన్ చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు జి.మహానంది కోరారు. బుధవారం ఆయన ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. నంద్యాలలోని తోటి లైనులో నివాసం ఉన్న చినబాబు (22)ను పోలీసులు బైక్ దొంగతనం కేసులో అక్రమంగా కేసు పెట్టి చిత్రహింసలకు గురి చేసి శారీరకంగా, మానసికంగా విచక్షణ రహితంగా కొట్టారని తెలిపారు. పరుష పదజాలంతో తిట్టారని, చేయని నేరాన్ని ఒప్పుకోమని బలవంతం చేసినట్లు తెలిసిందన్నారు. మనస్తాపానికి గురైన చినబాబు నందిపల్లె రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. చినబాబు మృతికి కారణమైన ఎస్ఐని సస్పెన్షన్ చేసి బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొలగవల్లి నాగరాజు, పెద్దగోనెహాల్ గోపాల్, హత్తిబెళగల్ లక్ష్మీనారాయణ, మల్లి, భరత్ పాల్గొన్నారు.



100 శాతం హాజరుండాలి

- ప్రతి విద్యార్థికి జెవికె కిట్లు - డిఇఒకె. సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పాఠశాలలు తెరచి 10 రోజులు అవుతున్న ఇంకా విద్యార్థుల హాజరు శాతం 60 నుండి 70 శాతం వరకే ఉంటుందని హాజరు వంద శాతం ఉండేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో ప్రజాశక్తితో పలు అంశాలపైన మాట్లాడారు. పిల్లలు బడికి వచ్చేలా హెచ్ఎం, ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడా లన్నారు. పిల్లలందరికి జగనన్న విద్యాకానుక కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని డిఇఒ సూచిం చారు. పిల్లలు పాఠశాలలకు యూనిఫామ్‌తో వచ్చేలా ప్రధానోపాధ్యాయులు పిల్లలకు, వారి తల్లిదండ్రులకు సూచనలు ఇవ్వాలన్నారు. ఇప్పటికే జిల్లాకు సరిపడ పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆ పుస్తకాలను వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని, తక్కువ పడితే టెక్స్ట్ బుక్స్ మేనేజర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలిపి తక్షణమే పుస్తకాలు తెప్పించుకొని, ప్రతి పిల్లవాడికి పంపిణీ చేసి వివరాలు అప్ లోడ్ చేయాలన్నారు. జిల్లాలో డ్రాప్‌ఔట్స్ ఉండకూడదని బడి ఈడు పిల్లలందరూ బడులలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, గ్రాస్ ఎన్రోల్ మెంట్ సర్వే ను వంద శాతంపూర్తి కావాలని అందుకు ఎంఇఒలు వార్డ్ వాలంటీర్ల ద్వారా వంద శాతం సర్వే అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాడు- నేడు పనులకు ఇసుక, స్టీల్, సిమెంట్ కొరత లేదని ఇసుక స్టీల్ అందుబాటులో ఉందని కాబట్టి పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

మాట్లాడుతున్న డిఇఒ

బుక్స్, యూనిఫామ్ అమ్మితే కఠిన చర్యలు..

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో బుక్స్, యూనిఫామ్ అమ్మకూడదని అలా అమ్మితే కఠిన చర్యలు తప్పవని డిఇఒ సుధాకర్ రెడ్డి ఆ యాజమాన్యాలను హెచ్చరించారు. మంగళవారం వారితో సమావేశం జరిపి చెప్పడం జరిగిం దన్నారు. అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన 5 శాతం, 95 శాతం సొమ్ము కేటాయించిన బుక్ స్టాల్స్‌కు చెల్లించి అక్కడి నుండి తీసుకెళ్లాలని ప్రయివేట్ యాజమాన్యలకు ఆయన సూచించారు. ప్రతి ప్రయివేట్ పాఠశాలలో ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని, ఫిట్‌నెస్ కలిగిన బస్సులు తిప్పాలని, ఫీజులకు అనుగుణంగా పాఠశాలల్లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాల న్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ ఫీజుతో ఉచితంగా విద్యను అందించాలని డిఇఒ అన్నారు. ఈ ఏడాది ఎవరైనా పేద విద్యార్థులను చేర్చుకోలేదని ఫిర్యాదులు వస్తే అలాం టి విద్యాసంస్థల పైన చర్యలు తప్పవని డిఇఒ హెచ్చరించారు.

తొలకరి పలకరించినా

పడని విత్తు...

- పదును కోసం ఎదురు చూస్తున్న రైతన్న..
- జిల్లాలో 11 మి.మీ. వర్షపాతం నమోదు
- అత్యధికం గోస్పాడు 51.6 మి.మీ., అత్యల్పం పాములపాడు 0.4 మి.మీ.
- 8 మండలాల్లో చినుకు జాడే లేదు..

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రుతుపవనాలు తాకాయి. తొలకరి జిల్లాను పలుకరించింది. రైతన్నల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఖరీఫ్ సాగుకు రైతు సిద్ధమౌతున్న వేళ దుక్కి పదును కోసం ఎదురు చూపులే మిగిలాయి.. మంగళవారం తొలకరి రావడంతో రైతన్నల్లో ఆశలు చిగురించాయి. పొలం దుక్కి దున్నాలనుకున్న రైతన్నకు ఈ తొలకరి నిరాశ మిగిల్చింది. పూర్తిస్థాయిలో వర్షం పడకపో వడంతో ఖరీఫ్ ఆశలు అడియశలు కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా కేవలం 11 మిల్లీమీటర్ల వర్షపాతం కావడంతో విత్తనాలు వేసేందుకు భూమి పదును కాలేదని రైతన్న అంటున్నాడు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం కురిసిన వర్షపాతం చుస్తే.... గోస్పాడు మండలం లో అత్యధికముగా 51.6 మి మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పాములపాడు మండలంలో 0.4 మి మీటర్లు వర్షపాతం నమోదైంది. అలాగే వెలుగోడు 46.6, డోన్ 41.2, దొర్నిపాడు 39.2, కోయిలకుంట్ల 26.0 కొలిమిగుండ్ల 20.8, సిరివెళ్ల 15.2, ఆళ్లగడ్డ, అవుకు మండలాల్లో 14.2, మి.మీ., పాణ్యం 10.6, సంజామల 8.2, ఉయ్యాలవాడ 7.0, చాగలమర్రి 6.4, గడివేముల 5.8, బండి ఆత్మకూరు 4.0, నంద్యాల 4.0 మి మీటర్లు, రుద్రవరం3.0, ఆత్మకూరు 1.6, నందికొట్కూరు 1.2, శ్రీశైలం 1.0, పాములపాడు 0.4 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా మిగిలిన ప్యాపిలి, బనగానపల్లె, బేతంచెర్ల, పగిడ్యాల, మహానంది, జూపాడు బంగ్లా, మిడ్తూరు, కొత్తపల్లి మండలాలలో ఒక చుక్క వర్షం కూడా పడలేదు. మేఘాలు కమ్ముకున్న వర్షం పడక పోవడంతో ఖరీఫ్ మరింత ఆలస్యం అయ్యో అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో విస్తారంగా వర్షం పడితే గాని ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉండదని అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో

ఇన్ పేషెంట్స్ సంఖ్యను పెంచండి

వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఇన్‌పేషెంట్స్ సంఖ్యను పెంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఇన్ పేషెంట్స్ సంఖ్యను పెంచడంతోపాటు డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. రక్తహీనత తక్కువగా ఉన్న హైరిస్క్ గర్భిణులను గుర్తించి క్రమ పద్ధతిలో ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేయడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంబంధిత గర్భిణుల ప్రాంతాలలో పర్యటించి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణను కలెక్టర్ ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య గుర్తింపు కార్డుల జనరేషన్‌ను వేగవంతం చేసి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వెలుగోడు, ఆత్మకూరు పట్టణాలలో కొత్తగా నిర్మించిన ఆసుపత్రులలో విద్యుద్దీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిసిహెచ్ఎస్ జఫ్రుల్లాను కలెక్టర్ ఆదేశించారు. వైద్యాధికారులందరూ ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా వేస్తూ పని వేళల్లో రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలకు, గర్భిణీలకు ఐరన్, ఫోలిక్ టాబ్లెట్లు ఇవ్వడంతో పాటు విటమిన్-ఎ ద్రావకాన్ని క్రమం తప్పకుండా వేయించాలన్నారు. ఈ సమావేశంలో అన్ని ఆరోగ్య కేంద్రాల మెడికల్ అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల్లో

మౌలిక వసతులు కల్పించండి : సిపిఎం

ప్రజాశక్తి - మహానంది

గాజులపల్లె గ్రామంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం గాజులపల్లె గ్రామ శాఖ ఆధ్వర్యంలో కోరుతూ మహానంది తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు మాట్లాడుతూ ప్రభుత్వం గాజులపల్లె గ్రామంలోనీ నిరుపేదలైన 296 కుటుంబాలకు అనేక సంవత్సరాల క్రితం గున్నంపాడు రస్తాల్లో ఒక్కొక్కరికి రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలం మంజూరు చేసిందని, ఆ స్థలంలో కొంతమంది ఇల్లు కట్టుకొని మరి కొంతమంది, బేస్ మట్టంలెవెల్ వరకు, మరికొంతమంది గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, ఈ స్థలంలో త్రాగునీరు, కరెంటు, రోడ్లు వసతి ప్రభుత్వం కల్పించకపోవడం వల్ల ప్రజానీకం ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. మరి కొంతమంది ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేస్తుందేమో అని ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. గతంలో అనేకమార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి తమ సమస్యలన్నీ తీసుకురాగా ప్రభుత్వమే బాధ్యతగా తీసుకొని పట్టాలున్న పేదలందరికీ పక్కా గృహాలు వసతులు ఏర్పాటు చేసి మోడల్ కాలనీగా రూపొందిస్తామని హామీ ఇచ్చారు కానీ ఇప్పటివరకు హామీ నెరవేర్చలేదన్నారు. కొంతమంది స్వార్థపరులు ఇండ్లు వేయలేదని నెపంతో పట్టాలను రద్దు చేయించే ప్రయత్నం చేస్తున్నారని, కావున స్థానిక తహశీల్దారు, ప్రజా ప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినటువంటి ప్రదేశంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని కోరారు. ఇప్పటికే బిల్డింగులు పూర్తి చేసుకున్న వారికి బిల్లులు మంజూరు చేయించాలని, బేస్ మట్టం లెవెల్లో ఆగిపోయిన వారికి వెంటనే బిల్లు ఇచ్చి నిర్మాణం కోసం సహకరించాలని, జగనన్న కాలనీలో అన్ని వసతులు కల్పించినట్టు ఈ స్థలంలో కూడా అన్ని రకాల వసతులు వెంటనే కల్పించాలని, కొందరి ఇళ్ల పట్టాలను రద్దుచేసి వారి స్థానంలో వేరే వారికి ఇవ్వాలని ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. అనంతరం తహసిల్దారు జనార్ధన్ శెట్టికి వినతి పత్రం సమర్పించారు. తహశీల్దారు మాట్లాడుతూ పేదల న్యాయమైన సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తానని, మౌలిక వసతుల కల్పన కోసం ఉన్నతాధికారులతో మాట్లాడుతానని, పక్కా గృహాల విషయంపై కచ్చితంగా చర్య తీసుకుంటానని పేదలకు హామీ ఇచ్చారు. తాసిల్దార్ వెంట డిప్యూటీ తాసిల్దారు నారాయణ రెడ్డి , వీఆర్వోలు, గాజుల పల్లె వైసిపి నాయకులు గంగవరం మధుసూదన్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లె ఇంటి పట్టాలు ఉన్న గ్రామస్తులు, సిపిఎం నాయకులు కోటకొండ బాష, మద్దిలేటి, సి రమణ, లాల్ హుస్సేన్ బి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు

యోగాతో దృఢత్వం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ మానసిక,శారీరక ప్రశాంతతకు,ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందని జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి అన్నారు. బుధవారం బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి .వెంకట రాముడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిచారు. ఆర్ఎస్ఐ అల్లా ఉద్దీన్ సిబ్బందికి యోగా గురించి వివరిస్తూ వివిధ యోగా ఆసనాలు చేయిస్తూ వాటి వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుతాల్లో యోగా ఒకటి అన్నారు. ప్రతి రోజు యోగాతో పాటు వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యాక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి .వెంకటరాముడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఏఆర్ డిఎస్పి రంగముని, ఆర్ఐ సుధాకర్, ఆర్ఎస్ఐలు ,స్పెషల్ పార్టీ పోలీసులు,,ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగాసనం చేస్తున్న పాతపేట పాఠశాల విద్యార్థులు

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలోని స్థానిక కోట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సలీమ్ బాష సభాధ్యక్షత యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా శాప్ యోగా కో ఆర్డినేటర్ శ్రీమతి అంజనీ స్వప్న హాజరు కాగా.. ప్రత్యేక ఆహ్వానితులుగా పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ మద్దిలేటి అచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల చేత ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించి వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల:** నంద్యాల పట్టణంలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో బుధవారము అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీ సత్యసాయి ధ్యానమండలి అధ్యక్షులైన నిచ్చెన మెట్ల సుదర్శనం, గౌడ్ , సునీల్ , ప్రకాశం, కృష్ణ, ఇతర ప్రముఖులు పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం .జి .వి . రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులలో ఏకాగ్రతను శారీరక వికాసాన్ని మానసిక ఒత్తిడి నుండి...

పోలీసు కార్యాలయంలో యోగాసానాలపై సూచనలు చేస్తున్న ఎస్పి

తరువాయి 6లో..

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

విద్యుత్ చార్జీల పెంపుదలను ప్రతిఘటించండి : సిఐటియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాడాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. యేసురత్నం, ఏ. నాగరాజు, శ్రీశైలం సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు దర్శనం. నాగరాజు, ఎం.చిన్న మారెన్న, నాగసైదయ్య అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలకు రూ.6 వేల కోట్ల భారం వేసిందన్నారు. నాలుగేళ్లలో 25 వేల కోట్ల రూపాయలు ప్రజల నెత్తిన మేపారని అన్నారు. మోడీ ప్రభుత్వానికి లొంగిపోయిన వైసిపి ప్రభుత్వం ఇక ప్రతినెల వంటగ్యాస్ లాగానే కరెంటు చార్జీలు పెంచడానికి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇప్పుడు మళ్లీ ప్రభుత్వం ప్రతి ఇంటికి షాప్‌కు స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారని, ఈ మీటర్ వస్తే చిన్న బల్బులు రీడింగ్‌లోకి వచ్చి ముందు డబ్బు చెల్లించి సెల్‌ఫోన్ మాదిరిగానే ప్రిపేర్ పద్ధతి కూడా వస్తుందన్నారు. కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో ఉద్యమాలు నిర్మించి పోరాటాలు చేయాల్సి వస్తుందని వారన్నారు.

పాఠశాలలను డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలను జిల్లా విద్యాధికారి సుధాకర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాశక్తి లో ప్రచురితమైన రహదారి లేని పాఠశాల వార్తకు స్పందించి త్వరలోనే ఆదర్శ పాఠశాలకు రహదారి ఏర్పాటు అయ్యేలా చేస్తామని,అలాగే వంట గది నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కస్తూర్బా పాఠశాలలో వర్షానికి తడిసిన సిమెంట్ బస్తాలను పరిశీలించారు. ప్రభుత్వ సొమ్ము దుబారా చేయరాదని యస్.ఓ.కు సూచించారు. ఫ్లోరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కోటయ్య, ప్రిన్సిపాల్ దినేష్, యస్. ఓ.లలిత,ఎం ఆర్‌సి రాజశేఖర్ లు పాల్గొన్నారు.

తడిసిన సిమెంట్ బస్తాలు పరిశీలిస్తున్న డి.ఈ.ఓ.

జెవికె కిట్ల పంపిణీ పూర్తి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ గురువారం సాయంత్రంలోగా 80 శాతం పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ, నాడు నేడు ప్రగతి పనులపై మండలాల వారిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈవో సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనబడి నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన 8 రకాల సివిల్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు. బడి బయట ఉన్న బడి ఈడు పిల్లల సర్వేను పూర్తిస్థాయిలో పెండింగ్ లేకుండా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నలుగురి ఎంఇఒలకు షోకాజ్ నోటీసులు

నాడు-నేడు పనులు, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీలో పురోగతి సాధించని ఎంఇఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ డిఇఒను ఆదేశించారు. బుధవారం జరిగిన విద్యాశాఖ అధికారుల సమావేశంలోజరిగిన సమీక్షలో దొర్నిపాడు, కొలిమిగుండ్ల, చాగలమర్రి, గడివేముల మండలాల మండల విద్యాశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీలో కూడా గురువారం సాయంత్రానికి బయోమెట్రిక్ హాజరు శాతం చూపకపోతే సంబంధిత ప్రధానోపా ధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

అన్న ప్రసాద వితరణకు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానం క్షేత్రం నిర్వహించే ఉచిత అన్నదాన పథకానికి ఒంగోలుకు చెందిన దుపటీ శ్రీనివాసరావు రూ.1,01,116 విరాళంను బుధవారం ఆలయ అధికారులకు అందజేశారు. ఈ విధంగా విరాళం అందజేసిన భక్తులకు దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా దేవస్థానం అధికారులు తెలిపారు.

గృహాలు పూర్తి చేసుకోండి

- హౌసింగ్ పిడి భాస్కర్ నాయుడు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాలలో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కర్ నాయుడు అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తహసిల్దార్ హరినాధరావు, ఈ ఈ మాధవరావు, డి ఈ నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ లతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నంద్యాల జిల్లాలో జులై 31 నాటికి 18,500 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అనంతరం హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కర్ నాయుడు సిరివెళ్ల మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లను సందర్శించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తాసిల్దార్ షేక్ మొహిద్దీన్, ఈఓఆర్డి నాగేంద్ర, హౌసింగ్ ఏఈ నాగ శేఖర్ తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, ఈఓఆర్డి తాహిర్ హుస్సేన్, వర్క్ ఇన్స్పెక్టర్ హరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న పక్క గృహ నిర్మాణ పనులు లబ్ధిదారులు వేగవంతంగా నిర్మించుకోవాలని నంద్యాల జిల్లా హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు అన్నారు. బుధవారం నాడు ఆయన మండలం లోని కరివేన గ్రామంలోని ఆత్మకూరు పట్టణంలోని చక్రం హోటల్ వెనుక జగనన్న కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. వేగవంతంగా గృహ నిర్మాణ పనులు చేసుకోవాలని అవసరమనుకుంటే ప్రభుత్వం లబ్దదారులకే 20 వేల రూపాయలు నగదును ఖాతాలు వేయడం జరుగుతుందని ఆయన అన్నారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి ఆయన తెలుసుకున్నారు. హౌసింగ్ అధికారులు నిరంతరం గృహ నిర్మాణ పనులను పర్యవేక్షించాలని లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆయన సందర్భంగా అధికారులకు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ ఉమామహేశ్వరయ్య, ఎంపీడీవో మోహన్ కుమార్, తాసిల్దార్ ఉమారాణి, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** జగనన్న ఇంటి నిర్మాణాలను త్వరగ తిన పూర్తి చేసేందుకు హౌసింగ్ కిందిస్థాయి అధికారులు పనిచేయాలని హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు మండలంలో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో గోపికృష్ణ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు, హౌసింగ్ ఏఈ శివరామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు

త్రిపుర బాధితులకు అండగా విరాళాల సేకరణ

ప్రజాశక్తి - ఆత్మకూరు

త్రిపురలో బిజెపి చేసిన దాడుల్లో బాధితులకు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాడు ఆత్మకూరు పట్టణ కేంద్రంలో విరాళ సేకరణ నిర్వహించారు. రూ.6258 వచ్చినట్లు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి ఏ. రాజశేఖర్, మండల అధ్యక్షులు మాబాష, కార్యదర్శి వీరన్నలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి చేసిన దాడుల్లో ఎంతో మంది నిరాశ్యులయ్యారని అన్నారు. త్రిపురలో బిజెపి పాలనకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై దాడులు జరుగుతున్నాయని, ఈ దాడులలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మరణించారని, అనేక మంది గాయాల పాలయారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సంజీవ రాయుడు, శంకర్ రెడ్డి,ఏ. రణధీర్, డి. రామ్ నాయక్, ఎన్, స్వాములు, ఏ. సురేంద్ర,సి. వెంకటేశ్వర్లు,దాస్, శివ కుమార్, గణపతి, మహమ్మద్,తదితరులు పాల్గొన్నారు.

విరాళాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏ రాజశేఖర్

వెదురు వేలంపాటల్లో రూ. 8.10 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - రుద్రవరం

మండల కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయం ఆవరణంలో బుధవారం నిర్వహించిన వెదురు వేలం పాటల్లో రూ. 8,10,000 లక్షల ఆదాయం వచ్చినట్లు డీఎఫ్ఓ వినీత్ కుమార్ తెలిపారు. మొదటి తరగతి వెదుర్లు 3000, రెండవ తరగతి వెదుర్లు 4500,మూడవ తరగతి వెదుర్లు 27000సేకరించి, మొత్తం 34,500వేల వెదుర్లు కు వేలం నిర్వహి ంచిన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజి అధికారి,శ్రీపతి నాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజా వలి, డిపోఫారెస్టర్ నాగరాజు, ఏరియా ఫారెస్టర్లు పెద్దన్న ,రాణమ్మ , మేస్త్రీలు కిట్టు, నరసింహ, సాయి, కాంట్రాక్టర్, కొల్లంపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎఫ్ఓ వినీత్ కుమార్

కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న లేబర్ అధికారులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - చాగలమర్రి

బడిఈడు పిల్లలు బడిలో ఉండకుండా కూలి పనులకు పంపించడం చట్టరీత్యా నేరమని, జిల్లా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తామని నంద్యాల జిల్లా సహాయ కార్మిక అధికారులు మురళీకృష్ణ, సమీర్, విద్యావతమ్మలు తెలిపారు. బుధవారం చాగలమర్రి పట్టణంలో కార్మిక శాఖ,ఐసిడిఎస్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని వ్యాపార సముదాయాలు,మెకానిక్ షెడ్లు,కుటీర పరిశ్రమలు తదితర ప్రదేశాలలో తనిఖీలు చేపట్టి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తల్లిదండ్రులు తమతమ పిల్లలను బడులకు పంపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు చంద్రకళ, హసీనా, వహిదా,రహమ్మత్,పోలీస్ సిబ్బంది శ్రీరామ్‌లు పాల్గొన్నారు.

అభినందనలు తెలిపిన ఎస్టీయు నాయక బృందం

ఎంఇఒ-2గా జనార్ధన్ గౌడ్ బాధ్యతలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల ఎంఇఒ-2గా ఎస్ జనార్ధన్ గౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్టీయు బేతంచెర్ల మండల శాఖ అధ్యక్షులు నాగేశ్వర్ నాయక్,నంద్యాల జిల్లా అధ్యక్షులు అజాం బేగ్ గారి ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల విద్యా శాఖ అధికారి -2 గా భాధ్యతలు స్వీకరించిన ఎస్. జనార్ధన్ గౌడ్‌ని ఎస్టీయు బృందం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించి ఘనంగా అభినం దనలు తెలిపారు. ఎస్. జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తాననిఅన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజ్,మండల ఆర్థిక కార్యదర్శి కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లయ్య, తిమ్మయ్య,రమేష్,ధనుంజయ,బలరాముడు,వెంకటేశ్వర్లు, శంకర్ నాయక్,ఆంజనేయులు,విజయలక్ష్మి,కృష్ణవేణితదితరులు పాల్గొన్నారు.

వర్షానికి పడిన చెట్ల తొలగింపు

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని ఎర్ర గూడూరు సమీపంలో ప్రధాన రహదారిపై మంగ ళవారం సాయంత్రం కురిసిన వర్షానికి చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో పాములపాడు ఎస్ఐ జి అశోక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహనాలకు అంతరాయం కలవకుండా చెట్లను బుధవారం తొలగించారు. వాహనదారులు ప్రజలు పోలీస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

చిలకలూరులో తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని చిలకలూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కా రమైనట్లు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లా డుతూ అనేక సంవత్సరాల నుంచి గ్రామంలో ఉప్పు నీటి తో ప్రజలు ఇబ్బంది పడే వారన్నారని, ఈ సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర రెడ్డి , ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, పుటాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి చొరవతో ఎంపీ లార్డ్స్ కింద రూ 28, 50 లక్షల నిధులతో చందలూరు గ్రామం వంక దగ్గర మోటారు వేసి 3200 మీటర్ల పైపులైన్ ద్వారా గ్రామానికి నీరు తరలించి ప్రజలకు మంచి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

టాస్క్ ఫోర్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - అవుకు

అవు కు పట్టణంలోని ఎరువుల దుకాణాలపై టాస్క్ ఫోర్స్ అధికారులు బుధవారము తనిఖీలు నిర్వహి ంచారు. వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంగల్ రెడ్డి, ఏఎస్ఐ సుబ్రహ్మణ్యంలతో కలిసి బచ్చు చిన్న వెంకటసుబ్బయ్య, శ్రీనివాస ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో ఎరువుల దుకాణాలలో నకిలీ, కల్తీ, ఎరువులను నియంత్రించాలని ఉద్దేశంతో తనిఖీలు చేసినట్లు తెలిపారు. బచ్చు వెంకటసుబ్బయ్య దుకాణంలో రూ.59000 విలువ గలిగిన అనుమతి లేని మందులను సీజ్ చేశారు. ఎరువుల దుకాణాల యజమానులు తప్పక నిబంధనలను పాటించాలని బిల్స్,స్టాక్ బోర్డు, క్రయవిక్రయాలకు సంబంధించి బిల్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ గా ఉండాలని అధికారులు తెలిపారు. ఎవరైనా నిబంధనలు పాటించక పోతే అట్టి యజమానులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అంగన్‌వాడిలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

అంగన్‌వాడి కేంద్రాలను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలని, పాటలు, ఆటలతో విద్య నేర్పిస్తామని అంగన్‌వాడి కేంద్రాల టీచర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 1,3,4,6,7 అంగన్‌వాడి కేంద్రాలు, ఆశా వర్కర్లు ఏ.ఎన్.ఎం.లు సమయుక్తంగా పూర్వ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబము తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్, కే. సునీత,కె. రమాదేవి, నరసమ్మ, శారద, హేమలత, ఆశా వర్కర్లు, గర్భవతులు , మదర్స్ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండల పరిధిలోని ఇందిరేశ్వరం గ్రామ సమీపంలో నల్లమల్ల అడవుల్లో అక్రమంగా తయారు చేస్తున్న నాటు సారా బట్టీలపై స్థానిక సబ్ సీఐ నాయుడు ఆధ్వర్యంలో బుధవారం నాడు దాడులు నిర్వహించారు. వీరి దాడుల సందర్భంగా 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తయారు చేస్తున్న గుల్ల నాగన్న అరెస్ట్ చేసినట్లు సిఐ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఖచ్చితంగా ఫలితం

- టిటిడి ఇఒ ధర్మారెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు

జీవితంలో ఎవరైనా సరే కష్టపడితే తప్పనిసరిగా ఫలితం దక్కుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం ఇఒ ఎవి ధర్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో పాఠశాలకు నిశ్చల్ నారాయణ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రూ.25 లక్షలు విలువైన ల్యాబ్ మెటీరియల్స్, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నిశ్చల్ ఫౌండేషన్ చైర్మన్, టిటిడి మాజీ బోర్డ్ డైరెక్టర్ నిశ్చల్ నారాయణ్, నాగేశ్వర రావు, పద్మావతిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాలలోనే ఎంతో మంది చదువుకొని పెద్ద పెద్ద స్థాయిలో ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. 1 తరగతి నుండి 10వ తరగతి వరకు తాను ఈ స్కూల్ లో చదువుకున్నానని గుర్తు చేశారు. తన మిత్రులు నాగేశ్వరరావు నాతో కలిసి టిటిడి బోర్డ్ మెంబర్‌గా నాలుగేళు కలిసి పని చేశారన్నారు. ఈయన కుమారుడు నిశ్చల్ నారాయణ్ మ్యాథ్స్‌లో దిట్ట అని వారి ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు నాలుగు ల్యాబ్‌లు, విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వాలని పిలవడం జరిగిం దన్నారు. అందుకు నిశ్చల్ వారి ఫౌండేషన్ ద్వారా రూ.25 లక్షలు విలువైన నాలుగు రకాల ల్యాబ్ మెటీరియల్స్, పుస్తకాలు అందజేసేందుకు రావడం అభినందనీయమన్నారు. అవసరమైతే పాఠశాలకు నిశ్చల్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ తరపున ఇద్దరు ఉపాధ్యాయు లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నిశ్చల్ ఫౌండేషన్ అధినేత నిశ్చల్ నారాయణ్ మాట్లాడుతూ చదువులో ఏకాగ్రతను కోల్పోకూడదన్నారు. విద్యార్థులకు నిశ్చల్ నారాయణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే ఈ మెటీరియల్స్, ల్యాబ్స్ విద్యార్థులకు వారి భవిష్యత్‌కు ఎంత గానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు నిశ్చల్ పౌండషన్ వారు పుస్తకాలను అంద జేశారు. ఈ

మాట్లాడుతున్న టిటిడి ఇఒ ధర్మారెడ్డి

కార్యక్రమంలో టిటిడి మాజీ బోర్డ్ మెంబర్ నాగేశ్వరరావు, ఆర్‌టిసి నంద్యాల జిల్లా ఆర్ఎం శ్రీనివాసులు, బిల్డర్, కాంట్రాక్టర్ ఏపి, తెలంగాణ నరెద్దుల శ్రీనివాస రెడ్డి, పిఆర్‌డిఈ ఈదుల నాగిరెడ్డి, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, తర్తుర్ సర్పంచ్ నాగిరెడ్డి, గ్రామ పెద్ద లు ఈదుల నారాయణ రెడ్డి, యోగేశ్వర రెడ్డి, వైకాపా నాయకులు హేమశేఖర్ రెడ్డి, దేవ సహాయం, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై అవగాహన

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం, యాగంటిపల్లి వారి ఆధ్వర్యంలో(ఖరీఫ్ సీజన్) వర్షాకాల సన్నద్ధత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ధనలక్ష్మి పాల్గొని భూసారా పరిక్షల ఆధారిత ఎరువుల వినియోగం వల్ల దాదాపుగా ఎకరాకు ఐదు వేల వరకు ఖర్చు తగ్గించగలమణి తెలిపారు. తక్కువ వర్షభావ పరిస్థితిలో తక్కువ కాల పరిమితి వుండే చిరుధాన్యల సాగు వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించుకోవచ్చని తెలిపారు. చిరుధాన్యాలను తప్పకుండ కనీసం ఇంటికి అవసరమైన వరకైనా పండించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి, కంది, మినిములు, చిరుదన్యాలకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు కేవీకేలో అందుబాటులో కలవని తెలియచేసారు. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ ఆధ్వర్యంలోనిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవీకే శాస్త్రవేత్తలు, సుధాకర్, రవి గౌడ్, లక్ష్మి ప్రియ, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఎంపీపీ బాలస్వామి, ఏపీఎం కల్పలత, ఏఈఓరాజు ఆర్ బి కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో వినతిపత్రాలు ఇస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు గ్రామ సచివాలయాలు ఆర్‌బికె సెంటర్ల దగ్గర వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఇవ్వడం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖరీఫ్ 2022 జిల్లాలో ఖరీఫ్ సీజన్లో అతివృష్టి, అనావృష్టి వల్ల అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతి న్నాయని అన్నారు. రైతులు అప్పుల ఊబిలో కుర్రుకుపోయారన్నారు. ఇంతవరకు రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వకపోవడం బాధాకరమ న్నారు. ప్రభుత్వం ఆర్బికే సెంటర్లలో కొనుగోలు చేస్తామని చెప్పి ఏ ఒక్క సెంటర్లోనూ ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే 2021-22 రైతుల పంటల అభిమా ప్రకటించి రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఆర్బికే సెంటర్లలో ఎరువులు,విత్తనాలు అందుబాటులో ఉంచి నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు బి రామ నాయుడు, పి మాధవ నాయుడు, కే మాధవస్వామి, గోపాల్, నారాయణ, సయ్యద్ బాష, దామోదర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పైన నీళ్లను వృధాగా పోస్తే చర్యలు

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని నాగలోటి గ్రామంలో రోడ్ల పైన నీటిని వృధాగా పోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామ పంచాయతీ సెక్రెటరీ సుబ్బారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో పర్యటించి గ్రామ పురవీధుల గుండా పోసిన వారికి నోటీసులు అందజేశారు. అలాగే గ్రామాల్లో నీటిని వృధా పోయడం వలన అవి నీరు నిల్వ ఉండి, మురికి ప్రాంతంగా తయారవుతాయని వాటి వలన దోమలు అభివృద్ధి చెంది వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నదని వారన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - పగిడ్యాల

కౌలు కార్డు పంపిణీ చేస్తున్న తహశీల్దార్

కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్లు తహశీల్దార్ భారతి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఎంతో ఉపయోగపడతా యన్నారు. కౌలు రైతులు పంట నష్టపోతే పంట నష్టపరిహారం, రాయతీ విత్తనాలు, ఎరువులు అందించే అవకాశం ఉంటుందన్నారు. సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు నష్టపోకుండా పంటలు సాగు చేసే ముందు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే రైతులకు సంబంధించిన పథకాలు అందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి కిషోర్ రెడ్డి తాసిల్దార్ హరినాథ్ రావులు ఆదేశించారు. బుధవారం వారు పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అహోబిలం రోడ్డులో ఉన్న న్యూ పావన లక్ష్మీనరసింహ ఏజెన్సీని తనిఖీ నిర్వహించి ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్ నిలువలను, స్టాక్ రిజిస్టర్లను, బిల్ బుక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల డీలర్లు రికార్డులు సరిగా నిర్వహించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చాగలమర్రి : మండలం ఎరువులు,విత్తనాలు,పురుగు మందులను ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి రంగనేతాజి హెచ్చరించారు. చాగలమర్రి పట్టణంలోని 2వ రైతు భరోసా కేంద్రంలో విత్తనాల,ఎరువుల,పురుగు మందుల డీలర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు,పురుగు మందులకు,విత్తనాలకు భిల్లులు తప్పకుండా ఇవ్వాలన్నారు. సరైన పత్రాలు లేకుండా ఎరువులు,పురుగు మందులను అమ్మిన అటువంటి దుకాణాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.ప్రతి దుకాణం నందు స్టాక్ పట్టికను ఏర్పాటు చేయాలన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల వ్యవసాయ కార్యాలయంలో డీలర్లతో వ్యవసాయ అధికారి హేమ సుందర్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విత్తన, ఎరువుల, పురుగుమందుల చట్టాల పైన అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ వెంకటరమణ

ప్రజాశక్తి - పగిడ్యాల

జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో వెంకటరమణ హౌసింగ్ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇండ్ల నిర్మాణంలో ఇచ్చిన టార్గెట్ ను తప్పకుండా పూర్తి చేయాలన్నారు. స్టేజి కన్వర్షన్ చేయాలన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇండ్లు నిర్మించుకునే విధంగా పరిపూర్తిగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని జగనన్న లే అవుట్లలో చేపట్టిన గృహ నిర్మాణాలు జులై 15 నాటికి పూర్తి చేయాలని ఎంపిడీఓ మహబూబ్ దౌలా కోరారు.బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఎంపిడీఓ మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో ఇళ్ళ నిర్మాణాలు జులై 15 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. కార్యక్రమం లో హౌసింగ్ ఏఈ షఫివుల్లా, సచివాలయాల ఇంజనీరింగు సహాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచర్ల

రాష్ట్రంలోని బడుగు బలహీన పేదల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గల నాగభూషణం రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కుమ్మరి కొట్టాల గ్రామంలో సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు ఆధ్వర్యంలో బుధవారం నాడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి సర్పంచ్ గుమ్మగల రాజు గ్రామంలోని ప్రజలను కలుసుకొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నవరత్నాల పేరుతో ప్రజలు దగ్గరికి వెళ్లి వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగే విధంగా జగనన్న ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

పథకాల బుక్‌లెట్‌లను అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నాయకులు

సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, మద్దిలేటి స్వామి చైర్మన్ రామ చంద్రుడు, గూని నాగరాజు, తిరుమలేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర అప్ప, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, రామలకోట కృష్ణుడు, శివ, గూని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగ దినోత్సవ సభ లో మాట్లాడుతున్న రామకృష్ణ రెడ్డి

డోన్ : మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమని

శాంతిరామ్ కళాశాలలో..

పాణ్యం మండలంలో..

యోగాతో దృఢత్వం

5వ పేజీ తరువాయి..

ఉపశమనం కలిగించడానికి యోగాసనాలు అవసరమని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు,విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం:** శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో దేవస్థానం చంద్రావతి కళ్యాణ మండపంలో శ్రీశైలం క్షేత్రంలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహి ంచారు. ఒంగోలుకు చెందిన యోగా గురువు గంధ వల్ల బాలసుబ్రమణ్యం యోగా గురించి ఉపయోగాలు వివరించారు. ఈ సందర్భంగా శ్రీశైల ప్రభ సంపాదకులు డాక్టర్ సి అనిల్ కుమార్ యోగ శాస్త్రం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, వేద పాఠశాల విద్యార్థులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** ప్రపంచ యోగ డే సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో కార్యాలయాలలో యోగాను చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎరుకల సంధ్య మాట్లాడుతూ సందర్భంగా ప్రతి ఒక్కరూగా చేస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. కస్తూరిబా బాలికల పాఠశాలలో ఆయుర్వేద డాక్టర్ నాగరాజు విద్యార్థినిలచే యోగాసనాలు వేయించారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎస్ఓ అనురాధ, ఎంపీడీవో వాసుదేవ గుప్త, పాఠశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఓ వెంకటరమణ తనిఖీ చేశారు. అనంతరం అక్కడ ఉన్న సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. యోగా దినోత్సవం పురస్కరించుకొని సిబ్బందితో యోగ చేపించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రూపేష్ కుమార్ రెడ్డి, ఎంపిహెచ్ఓ విజయ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం అని యోగా గురువు సుబ్బయ్య అన్నారు. మండలంలోని బొల్లవరం గ్రామ సమీపం లోని చెరువు నందు ఉపాధి కూలీలతో యోగా దినోత్సవం నిర్వహించారు. ఉపాధి కూలీలతో యోగా ఆసనాలు చేయించి, యోగ గురించి సందేశాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సుబ్బయ్య, ఏపీవో మనోహర్, టిఎ మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగ ప్రసాద్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **పాణ్యం :** మండలం లోని శాంతి రాం ఫార్మసీ కళాశాలలో యోగా దినోత్సవం సందర్భంగా యోగా మాస్టర్ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధు సుదన్ జెట్టి, మండల విద్యాధికారి కోటయ్య నాయక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

యోగాతోనే మానసిక ఒత్తిడిని జయించవచ్చు

- సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమని

డోన్: యోగ చేయడం వల్ల మానసిక ఒత్తిడిని జయించవచ్చని డోన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. తంగమని అన్నారు. పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్ తంగమని, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ హనీషా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్, అంబేద్కర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమని మాట్లాడారు. అనంతరం గీతా యోగాసన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. యోగా గురుజి రాంపుల్లయ్య,బార్ అసోసియేషన్ అధ్యక్షులు రేగటి రాజశేఖర్ రెడ్డి, సెక్రటరీ శేషశయనరావు, ఉపాధ్యక్షులు పి. శివరామకృష్ణ, న్యాయవాదులు ఎం.నాగభూషణం రెడ్డి, ఎస్.జబివుల్లా, నజీర్‌అహ్మద్, కృష్ణమూర్తి, లక్ష్మన్న,రంగారెడ్డి, యోగ సభ్యులు యశ్వంత్ పాల్గొన్నారు.

పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో.. యోగ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం వెంకటసుబ్బారెడ్డిలు అన్నారు. పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు యోగా దినోత్సవం నిర్వహించి, విద్యార్థులతో యోగా ఆసనాలు చేయించారు. సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, వెంకట రమణ, ఎస్.ఎస్.బాబు,వెంకట లక్ష్మీ, అనంత శ్రీనివాసులు, రాధ, అల్లిపిర,భూ కాంత్ రెడ్డి, మద్దిలేటి, సుబ్బ రా యుడు, మధుసూదన్ రెడ్డి, సుభాన్,శివన్న, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాశ్ రెడ్డి,భారతి,లక్ష్మీ ప్రభావతి,హుస్సేన్ భాను, ప్రసాద్, శ్రీనివాసులు,సుబ్బారెడ్డి,మునిరాజు, తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయురాలు దస్తగిరమ్మ ఆధ్వర్యంలో యోగ ఆసనాలు చేశారు.

పాములపాడు : యోగాతో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరవీంద్రుడు అన్నారు. పాములపాడు మండలంలోని మోడల్ స్కూల్ నందు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతిరోజు యోగాకు కొంత సమయాన్ని కేటాయి స్తే ఆరోగ్యవంతంగా ఉండవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాములపాడు సర్పంచ్ మేకల భాగ్యమ్మ, పాములపాడు ఎంపీటీసీ రమాదేవి, డాక్టర్ గోకారి, డాక్టర్ గజసింహరాజు, స్కూల్ కమిటీ మెంబరు జాల రామ్మోహన్ రావు, పిఈటి సాయి కృష్ణ , యోగా ఇన్స్ట్రక్టర్స్ శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో యోగా ఆసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ కె మాధవరావు చౌదరి పాల్గొని యోగా గురించి వివరించారు. అనంతరం వ్యాయామ విద్య ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినిలు, ఉపాధ్యాయులతో యోగ అవగాహన ర్యాలీని జెండాతో ప్రారంభించారు. ఈ ర్యాలీ కళాశాల నుండి పెట్రోల్ బంక్ కూడలి వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వి విజయ కుమారి, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ బడే సాహెబ్, డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వసుంధర, డాక్టర్ మొహమ్మద్ గౌస్, డాక్టర్ కోటేశ్వర రావు, డాక్టర్ నాగరాజా రెడ్డి, నరేంద్ర నాథ్ రెడ్డి,వరలక్ష్మి వరలక్ష్మి, వహీదా, నీతమ్మ తదితర అధ్యాపక బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో.. నంద్యాల : స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో అంతర్జాతీయ యోగా డే నిర్వహించారు. కళాశాల ఎన్సిసి డే విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నంద్యాల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ అర్చన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగా చేస్తున్న ఎన్సిసి క్యాడేట్స్ ని ఉద్దేశించి కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో అనేక మార్పులు వస్తున్నాయని, భారతీయ కళలకు, యోగా, క్రీడలు వంటి అంశాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అర్చన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుండి యోగా సాధన చేయాలని, తెల్లవారుజామునే లేచే అలవాటు చేసుకోవాలని అన్నారు. సత్యసాయి ధ్యాన మండలి సభ్యులు ప్రసాద్ విద్యార్థుల చేత యోగ సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి ఆఫీసర్ కెప్టెన్ లలితా సరస్వతి, ఎన్సిసి సిబ్బంది సుబేదార్ వినోద్ మింజ్, హవల్దార్ గంగాధర్, రమణమ్మ, రూట్, శంకర్, పెద్ద స్వామి, వెంకటేశ్వర్లు, సత్యసాయి ధ్యాన మండలి సభ్యులు సుదర్శన్, ప్రకాష్, సునీల్ గౌడ్, కృష్ణ, రమణయ్య, ఎన్సిసి క్యాడేట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాములపాడు : యోగాసనం చేస్తున్న విద్యార్థులు

నందికొట్కూరు: యోగాసనం చేస్తున్న విద్యార్థులు

యోగ పై ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులో విద్యార్థులు

గడివేముల: మండలంలో..

మహానంది మండలంలో..

బండి ఆత్మకూర్ : విద్యార్థులతో యోగా చేయిస్తున్న దృశ్యం